## మున్నుడి

అన్నమాచార్యులవారి ఈ అద్భుత కీర్తన వినని తెలుగువాడు ఉండే అవకాశమేలేదు. జగద్విఖ్యాతమైన ప్రతిగాయకుని నోట పలికిన అమృతధార ఈ కీర్తన. ఆ స్వామికి మనమీద అనుగ్రహం కలిగితే మన వెంటబడి మరీ మనని తనవైపు తిప్పుకొంటాడు. నాకు నీ వక్కరలేదయ్యా బాబూ! అనినా వదలడు. ఎట్లాగో అట్లా మనని తనవైపు తిప్పుకొంటాడు. తన సర్వస్వం ఇచ్చి మనవెన్ను కాస్తాడు. ఆయన ఏడు కొండల కంటే పెద్దవైన కోర్కెలు తీరుస్తాడు. అడుగడుగునా ఆపదలు తీరుస్తాడు. ఇదిచక్కగా నిరూపించడానికి ఎన్నో ఉదాహరణలిస్తున్నారు అన్నమయ్య. భక్తిలేకపోతే వజ్రాల కిరీటాలు చేయించినా.. ఉత్తి... దండగ.

**ఉ॥ కొండలలోన నిల్చుకొని 'కోనలయేటికి' రాయుడీతడై**
**అండగ నాదుకోగలడు 'ఆపద' బాపును భక్తి మ్రొక్కినన్**
**కొండల వంటి కోరికలు కొల్లగ తీర్చును అన్నమయ్యనెన్**
**దండగ డాబు దర్పములు దగ్గర రాదుర 'కోట్లు' బెట్టినన్**

**రాగం : హిందోళం**

కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు ॥కొండలలో॥

కుమ్మరదాసుడైన కురువరతి నంబి
ఇమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములు సేసినయట్టి తొండమాంజక్కుర వర్తి
రమ్మన్నచోటికి వచ్చి నమ్మినవాడు ॥కొండలలో॥

అచ్చపు వేడుకతోడ అనంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక తిరుమల నంబితోడుత
నిచ్చనిచ్చమాటలాడి నచ్చిన వాడు ॥కొండలలో॥



Scanned with CamScanner

కంచిలోన నుండ తిరుకచ్చి నంబిమీద కరు-
ణించి తనయెడకు రప్పించినవాడు
యెంచనెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ పాలించినవాడు ॥కొండలలో॥

## భావామృతం

ఏడుకొండలపైన కోనేటిగట్టున వెలసిన కోనేటి రాయుడు శ్రీవేంకటేశ్వరుడు ఆయన ప్రత్యేకతేమిటంటే భక్తితో వేడుకొంటే ఆ మహానుభావుడు తన కొండలంత వరములను తన భక్తులపై గుమ్మరిస్తాడు.

కురువరతి నంబి అనే కుమ్మరిదాసుడు, స్వామిని తనకు ఈ వరం కావాలి ఆ వరం కావాలి అని యెన్ని వరాలు కోరుకొంటే అన్ని వరాలిచ్చాడు. మరి ఆయన పూజకి పూలులేకపోతే బంకమట్టితో పూలుచేసి స్వామీ! స్వీకరించు అని భక్తితో సమర్పించాడు. ఎంత అనుగ్రహమో కదా!! తన చిన్నమామగారైన తొండమాన్ చక్రవర్తి తనకి ఆనంద నిలయం కట్టించాడని తన శంఖచక్రాయుధాలు ఆయనకిచ్చి, తన బావమరిది వైపు తను నిలిచి యుద్ధంచేసి చివరికి రాజీ కుదిర్చి తొండమానుడు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్ళాడు. ఇంత భక్తవాక్పరి పాలకుడుంటాడా? అసాధ్యం.

అనంతాళ్వారు అనే భక్తుడు స్వామికే దొంగతనం నేరానికి మట్టిమోసే శిక్షవేస్తే వేడుకగా స్వీకరించి మట్టిమోసి ఆయనను అనుగ్రహించి ఆ తరువాత పుష్పకైంకర్యం స్వీకరించినవాడు ఈ దయామయుడు. అనునయంగా తిరుమలనంబి అనే భక్తునితో ప్రతిరోజు ప్రత్యేకంగా మాట్లాడి అనుగ్రహించిన వాడీ తిరుమలేశుడు.

నేను కంచిలోనే వుంటాను. తిరుమల రానేరానని భీష్మించుకొన్న తిరుకచ్చినంబి అనే భక్తుని అనుగ్రహించుటకు తనే స్వయంగా కంచివెళ్లి మాయోపాయంతో తన తిరుమలకి రప్పించుకొనిన చతురుడు ఈ శ్రీనివాసుడు. స్వామి కరుణ అంచనా వేయటం అసాధ్యం. మనం ఆయన శరణాగతులం కావున తను మంచివాడై ఈ శ్రీవేంకటేశ్వరుడు దయతో మనల్ని శ్రద్ధగా పరిపాలిస్తుంటాడు.



Scanned with CamScanner

2

07. 06. 2020



## 1-82

## మున్నుడి

అన్నమాచార్యుల వారి ఘనత తెలియాలంటే ఈ చిన్న కీర్తన పరిశీలించండి. 'బంటు' అంటే సేవకుడు, భక్తుడు, శిష్యుడు అని నానార్థములున్నాయి. సేవచేసేవాడు, భక్తితో కొలిచేవాడు, యజమానిని గురువుగా భావించి చెప్పిన మాట వినేవాడు - అటువంటి వ్వాడే బంటు. మన రామదూత హనుమంతుడు. ఈ కీర్తనలో ఆ బంటు లక్షణాలు చెబుతున్నారు.రాముడే వేంకటేశ్వరుడని, మారుతిని స్వామికి దాసునిగా కీర్తిస్తున్నారు. ఇంత చిన్న కీర్తనలో, ఆదిలోనే హంసపాదన్నట్లు మొదటిమాటకే అర్ధం తెలియదు.....

**చం॥ అటిముటి బంటు యాతడని అంజనసూనుని తానుతించెరా**
**వెఅపను మాటనెంచదని వీనుల విందుగ అన్నమార్యుడున్**
**సిరిపతి వేంకటేశ్వరుని సేవతరించెడివాడనెన్, భళీ!**
**ఎఱుగము యిట్టి కీర్తనము నెవ్వడు పాడెధరాతలందునన్.**

**రాగం : శ్యామ**

అటిముటి హనుమంతుడట్టి బంటు
వెఱపులేని రఘువీరునికి బంటు ॥అటిముటి॥

యేలికను దైవముగా నెంచి కాల్చేవాడే బంటు
తాలిమి గలిగిన యాతడే బంటు
పాలుమాలకయే పొద్దుపని సేయువాడే బంటు
వేళగాచుక వుండేటి వెరవరే బంటు ॥అటి ముటి॥

చెప్పినట్టనే నడచిన యాతడే బంటు
తప్పులేక హితుడై నాతడే బంటు
మెప్పించుక విశ్వాసాన మెలగు వాడే బంటు
యెప్పుడును ద్రోహిగాని హితుడే బంటు ॥అటి ముటి॥



Scanned with CamScanner

కాని పనులకు లోనుగాని వాడే బంటు
ఆనాజ్ఞ మీరని యాతడే బంటు
నానాగతి శ్రీ వేంకటోన్నతుడైన యతనికి
తానిన్నిటా దాసుడైన ధన్యుడే బంటు ॥అటి ముటి॥

## భావామృతం

సంభ్రమము కలిగించు ఈ హనుమంతుడు అటువంటి వాడని బంటు అంటే ఈయనే అని, భయమను మాటనెరుగని రాఘవునికి నమ్మిన బంటు ఈ స్వామి, అని తెలుసుకోండి.

ఇక ఈ బంటు యొక్క లక్షణములను వినండి. ఇతడు తనయజయానిని దైవంగా భావించి కొలిచే స్వభావం కల బంటు. ఎంతో ధైర్యం కలిగిన వాడీ బంటు. ఏ మాత్రం సోమరితనం లేక ఏ వేళనైనా తన యజమానిని సేవించువాడే ఈ బంటు. అన్ని సమయాలలోను తగిన ఉపాయముతో సిద్ధముగావుండే వాడే ఈ బంటు.

తు.చ తప్పకుండా చెప్పినట్లు నడుచుకొనేవాడు ఈ బంటు. ఏవిధమైన తప్పిదముచేయక హితము చేసేవాడే ఈ బంటు. గొప్పవిశ్వాసమునకు మారు పేరన్నట్లుగా యజమానిని మెప్పించుచు మెలగువాడే బంటు. ఏనాడూ ద్రోహం చేయక మేలు చేసేవాడే బంటు అని పిలువదగ్గవాడు.

లోభానికి లొంగి ఏనాడూ తగని పనులు చేయనివాడే నమ్మిన బంటు అంటే ఆనపెట్టినట్లు ఉత్తరువులను అమలుపరచువాడే సరియైన బంటు. పలు విధములుగా (పైన చెప్పినట్లు) శ్రీ వేంకటేశ్వరుడైన స్వామికి తాను అన్నివిధములుగా దాసుడైన బంటు ఈమహానుభావుడు శ్రీ ఆంజనేయుడు.



Scanned with CamScanner